# రేపటిభయం

వాణిశ్రీ



ఇంట్లోకి అడుగు పెట్టబోయిన వాడల్లా వరండాలోనే ఆగిపోయాడు. లోపల నుంచి మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి. చెవులు రిక్కించి వినసాగాడు కృష్ణారావు.

"ఏవండోయ్."

"ఏమిటే."

"బియ్యం ఎక్కడ తెచ్చారు ?"

"సూపర్ బజార్లో."

"మీ తెలివి తెలారినట్లే వుంది. బియ్యం సూపర్ బజార్లో తెస్తారా ఎవరైనా ?"

"ఏం జరిగిందే ?"

"నా బొంద జరిగింది. సగానికి సగం నూకలు. మట్టిగడ్డలూ మన్నూ మశానం. బొత్తిగా పాలిష్‌లేదు. అన్నం వుడుకుతుంటే ఒకటే వాసన, ఎన్నేళ్ళ గోడౌన్లో నిలవున్నాయోగాని."

"పాత బియ్యం లేవే."

"రుచీ పచీ లేవు ముదనష్టపు బియ్యం. తీసికెళ్ళి వాళ్ళ ముఖాన కొట్టండి."

"వాళ్ళు వాపస్ తీసుకోరే."

"అయితే నెల్లాళ్ళా ఈ కంపు బియ్యం తినాల్సిందే నన్నమాట."

"ఎలాగో సర్దుకో."

"ఏవండోయ్."

"ఏమిటే ?"

"కిష్టిగాడికి వుత్తరం ముక్క రాశారూ ?"

"ఆఁ. ఆఁ..."

"ఆఁ. ఆ. అనడమేనా. నిజంగా రాశారా ?"

"అబ్బ రాశానే బాబూ. నా మాట నమ్మి చావవేం ?"

"మరి రాస్తే వాడింకా రాలేదేం ? రేపేగదా పండగ"

"ఏమో? ఎందుకు రాలేదో? ఆఫీసులో సెలవుగాని ఇవ్వలేదేమో ?"

"అడ్రసు సరిగా రాశారా."

"అబ్బబ్బ ఏమిటే నీ గొడవ. ఆఖరికి అడ్రసు రాయడంగూడా రాదని తేల్చేశావన్న మాట. నెలకు ఎనిమిదొందలు ఇచ్చి గవర్నమెంటు వాళ్ళు అడ్రసు రాయడం రాని వాడిని పెట్టుకున్నారన్న మాట. నీ మొగుణ్ణిగదా అని మరీ అంత తీసి పారెయ్యకు."

"వూఁ... అంత తెలివి తేటలుండబట్టే ఇంత వైభోగంగా వెలిగిపోతోంది ఇల్లు. ప్రక్క వీధిలో సుబ్బారావు మీ ఆఫీసులోనేగా పని చేసేది. ఏభైవేలు పారేసి డాక్టర్ని అల్లుడిగా తెచ్చుకున్నాడు."

"అబ్బ చాల్లేవే నీ గొడవ. ఆ సుబ్బారావులా సంపాదించడం నావల్ల కాదు,"

"అది చేతనైతే నేను ఇట్లా ఎందుకుంటానూ ? ఒక్కగానొక్క పిల్ల పెద్దమనిషై ఆరేళ్ళు దాటిపోతున్నా, అది పందెపు గుర్రంలా ఎదిగిపోతున్నా పెళ్ళి మాటెత్తుతున్నారూ ?—అవ్వ చెప్పుకుంటే సిగ్గుచేటు."

"నువ్వేగదే మా కిష్టిగాడు ... మా కిష్టిగాడికివ్వాలని ఎగిరి పడుతున్నావు. పరాయి సంబంధాలు చూస్తే నువ్వు పురేసుకుంటానని ఏడుపులూ పెడబొబ్బలూ మొదలుపెట్టే దానివికాదూ."

"చాల్లెండి మీ నిర్వాకం. ఎవరైనా వింటే నవ్విపోతారు, తమ్ముణ్ణి అల్లుడు చేసుకోవాలని ఎవరికుండదు గనక."

"మరింక ఆ సాధింపు ఎందుకేం?"

"ఏవండోయ్ !"

"మళ్లీ ఏమొచ్చిందే! నన్ను కాస్త పేపరుగూడా చదువుకోనివ్వవా ఏం? ఇంటి కంటే ఆఫీసే సుఖంగా వుంది నా ప్రాణానికి."

"వుంటుంది ... వుంటుంది. ఆ పైపిస్సు టక్కులాడి ఎదురుగా కూర్చుని టక్కు... టక్కు... లాడిస్తుంటే మీరు దేభ్యంమొఖం వేసుకుని చూస్తుంటే సుఖంగా వుండదూ!... అవ్వ పెళ్లిగాని పిల్లని ఇంట్లో..."

"ఛీ... ఛీ... ఏవిఁటే నీ అర్థం పర్థం లేని వాగుడు."

"వున్న మాటంటే... అంత వులుకెందుకూ ? నాకు తెలియదా మీ ఆఫీసు భాగోతం. అన్నట్టు రేపు ఆఫీసుకెళ్లేటప్పుడు మొన్న తెచ్చిన చీర వాపస్ ఇచ్చెయ్యండి."

"ఏం ?"

"అమ్మాయికి నచ్చలేదంట."

"అదేమిటే మొన్నెప్పుడో కట్టుకుందిగా ?"

"కట్టుకుంటే కట్టుకుందిలే. కాసేపు కట్టుకుంటే అరిగిపోయ్యిందా కరిగిపొయ్యిందా. దాని స్నేహితురాలెవరో బాగాలేదని అన్నదట."

"అందుకని కట్టుకున్న చీర వాపస్ ఇవ్వనా ? తెచ్చి పదిరోజులైతే వాళ్లిప్పుడు తీసుకుంటారా ?"

"ఏం ? ఎందుకు తీసుకోర్టూ ? డబ్బులు వూరకే రాలా."

"అదిగాదే. కట్టుకున్న చీరని ఆ కొట్టువాళ్లు గుర్తుపడితే."

"వాడి బొంద గుర్తుపడతాడు? అమ్మాయి శుభ్రంగా ఇస్త్రీ చేసిందిగా ?"

"హరి దేవుడా ?... నేనేం పాపం చేశానని ఈ జన్మలో ఈ రాక్షసిని కట్టబెట్టావు ?"

"ఏవిటంటి మీ గొణుగుడు ?"

"ఏం లేదులేవే ?... పెద్దగాడిద ఇంకా బడినుంచి రాలేదా ?"

"వాడెక్కడ పెత్తనాలు చేస్తున్నాడో. వాడికి అన్నీ మీ తమ్ముడి బుద్ధులేనండీ. ఎప్పుడూ బలాదూర్ తిరుగుతుంటాడు. ఖర్మ... వంశాని కొకడైనా ఇటువంటి వాళ్లు పుడుతుంటారు..."

"ఇప్పుడు వంశానికేమొచ్చిందే ? కాఫీ ఏమైనా ఇస్తావా లేదా ?"




"అయ్యో రామా! మీకింకా కాఫీ ఇవ్వనే లేదా ? నా మతి మండిపోనూ. వుండండి పొద్దుటి కాఫీ మిగిలి పోయాయి వెచ్చబెట్టి ఇస్తాను."

"... ... ... ..."

"ఎవరక్కడా?... ఆఁ... నువ్వంటరా! ఎంతసేపైంది వచ్చి... ఏవండోయ్!... మా తమ్ముడు వచ్చాడండీ!. ఏరా మీ బావ రాసిన వుత్తరం అందిందా?"

"ఆఁ...అందింది అక్కా!"

"ఏవిటోయ్. అక్కడే నిల్చున్నావ్?"

"ఏం లేదు. మీరేదో మాట్లాడుకుంటుంటే, వింటున్నా."

"అమ్మాయ్!... చిట్టీ... మావయ్య వచ్చాడే కాళ్లకు నీళ్లివ్వు."

* * *

"ఏవోయ్! శ్రావణమాసంలో ముహూర్తం పెట్టించ మంటావా?... హోటల్ కూడు ఎన్నాళ్లు తింటావూ?"

"ఆ మాట వాడిని అడగాలటండీ! మీదంతా మరీ విడ్డూరం కాకపోతేనూ! వాడికి ఎవరున్నారూ! పెద్దదిక్కు మీరేగా."

"నేను వెళ్ళి లెటర్ రాస్తాగా."

* * *

మహారాజశ్రీ బావగారికి నమస్కారం—

నేను మీఇంటికి రాక పూర్వం పెళ్ళి చేసుకోవాలని అభిప్రాయం వుండేది. కాని మొన్నపండగకి వచ్చి మీఇంట్లో నాలుగు రోజులు వుండి మీ దాంపత్యం చూశాక నాకు పెళ్లి వైరాగ్యం కలిగింది. పెళ్ళిచేసుకోకుండా బ్రహ్మచారిగా వుంటేనే సుఖంగా వుంటుంది. మా అమ్మ నోట్లో మంచి వూడి పడింది మాఅక్కయ్య. మా అమ్మ గయ్యాళి తనం భరించలేక మా నాన్న సన్యాసుల్లో కలిసిపోయి కాశీలో చనిపోయిన సంగతి అందరికీ తెలిసిందే గదా! ఇక మాఅక్కయ్య పోలికలు మీ అమ్మాయికి వచ్చి వుంటే నా గతేంకాను? సన్యాసం పుచ్చుకోవడం నా కిష్టంలేదు. నామీద ఆశ పెట్టుకోకండి మీ అమ్మాయికి వేరే సంబంధం చూసుకోండి.

ఇట్లు
మీ బావమరది
కృష్ణారావు.

## ఏమిటి పాడేది ?

**ఏమిటి పాడేది — నేనేమని పాడేది**
పూవునైతే పదముల వ్రాలి
తీవెనైతే అల్లుకుపోయి
ఏదికాక ఏమీరాక
నవ్వునైతే పెదవులపైని
నావనైతే నదములపైని
ఏదికాక దారే కానక
పసిడినైతే కొలిమిని కాలి
పగడమైతే పసిడినిచేరి
ఏదికాక ఏదీ తేలక
మంచులాగ కరిగిపోయి
అడివిగాచిన వెన్నెలనై — ఈ
మూగవోయిన గొంతుకతో
ఏమిటి పాడేది ? నేనేమని పాడేది.

— స నా రా